# అదృష్టకవచం

శ్రీ పైడిమర్రి వేంకటసుబ్బారావు

అదృష్టం పాత్రిళ్ళలో పెరిగిన భారతీయుడికి కనబడేదంతా వేదాంతం, నిస్పృహ, వైరాగ్యం. సాంఘిక జీవితం, మర్యాదలు, పరిసరాల ఒత్తిడి, అనే తిరుగళ్ళ మధ్యన చూర్ణం కావడమే ఆర్థిక వ్యవస్థ నిత్యపరిణామం. దాని ప్రతిఫలమే గడచే ఒక్కొక్క రోజుకు అడుగడుగున అన్ని హంసపాదులు

అబ్బాయి స్కూలుఫైనలు పరీక్షాఫలితాలు ప్రకటించిన వార్తా పత్రిక తీసుకొచ్చి 'నాన్నా! నేను ప్యాసైనా ఇదిగో! రెండో తరగతిలో' అని తన నెంబరు చూపిస్తూ కుర్చీ ప్రక్కన నిల్చున్నాడు. పత్రికలో అబ్బాయి నెంబరు చూచాను.

'ఔను! రెండవ తరగతి!' అని ఇంకా వేరేశబ్దాలు రాకుండానే, ఆలోచనా తరంగాలలో లీనమైన భావాలతో, నాభౌతిక వ్యాపారం స్తంభించిపోయింది.

'నాన్నా! పైక్లాసు చదివించవూ!' ఈమాటలు కశాఘాతంలా తగిలి భావ పరంపరల్ని మరింత వేగంగా పరుగెత్తించినవి.

మానాన్న చనిపోయిన ఆ కొత్త రోజుల్లో, ఎవరూ వెళ్ళవేసే మగదక్షత లేని సంసారాన్ని, అమ్మ ఒక్కతే నడుపుతూ ఉండేది అప్పుసప్పులు లేని సంసారాలు యే కొన్ని ఉన్నాయోగాని మనలాటి సామాన్య గృహస్థులకు అప్పు నిత్యం చేసే ఒకతప్పు అదే ఒక ముప్పు వడ్డికి వశిస్రాలు చాలవు పెరిగి పెరిగి ఆవంతలు కొండంతలైన అప్పు పత్రాలు చెల్లువేస్తూ లేమిడి కాపురంతో కష్టమయ జీవితాన్ని గడుపుతున్న సమయం ఏకైక పుత్రుణ్ణి అయితేనేం? సంపన్నులైతేనేగదా ఏక పుత్ర విషయంలో సుఖం కలిగేది. విత్తం కొద్దీగదా వైభవం ఒక ప్రక్కన బడిలో చదువుకుంటూ, తీరిన సమయంలో ప్రైవేటుట్యూషన్లు చెప్పుకుంటూ, కష్టంగా వెళ్ళే బస్తీకాపురానికి, ఆ వచ్చే పది, అయిదులతో సాయపడుతూ ఉండేవాణ్ణి. స్కూలు ఫైనలు పరీక్షతో సమీపంలో ఉన్న పాఠశాల విద్య సమాప్తమైపోయింది. పై చదువుకు పట్నంపోవాలి.

పరీక్షాఫలితాలు తెలిశాయి. ఉన్నత విద్య కావాలని అనర్ఘ విద్యాసంస్థలో, విద్యాతృష్ణ తీర్చుకోవాలనే ప్రబలమైన కాంక్ష మొదటినుండీ లోపల పీడిస్తూ ఉండేది. భగీరథ ప్రయత్నంతో నలభై రూపాయలు సంపాదించుకొని పట్నం బయలుదేరి కాలేజీలో ప్రవేశ సమయం (అడ్మిషన్ తేది) లో దరకాస్తు పెట్టా. చేరాలనే ఉబలాటంతో కళాశాలాధికారుల నర్థించా. నా ప్రార్థనలన్నీ సముద్రం మీది వర్షంలా నిష్ఫలమైనాయి. చేతిలో ఉన్న ఆకష్టార్జితపు రూకలు పట్నంలో అటూ ఇటూ తిరగటంలో కర్చైపోతూ ఉన్నై. కులకక్షుల పెనుభూతాలు విద్యా సంస్థలలో కూడా చేరినై విద్యార్థి జీవితాన్ని కూడా కబళించడానికి ప్రత్యక్షమైనాయి అంతటితో ఉపయోగంలేని ప్రయత్నాన్ని మానుకొని యిల్లు చేరుకున్నా. "చదివిన చదువు చాలుతే ఇంకా యెంతకాలం? మీ అమ్మను ఇంకా శ్రమ పెడతావా? ఏదైనా ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించు," అనే మాటలు ప్రతివైపునుండి వినవస్తూ ఉన్నాయి ఓ పక్కన చెప్పలేని అమ్మయొక్క కరుణామయమైన ఆక్రోశన. రెండోపక్కన నా చదువు మధ్యలో ఆగిపోతున్నదనే బాధ. దిక్కులేని కాపురంతో ముందు చదివితేమాత్రం యేలాగ అనే ఆలోచన. ఇవన్నీ నా మెదడును కలచివేశాయి. మానవుడికి జన్మహక్కుగా ఉన్న విద్యకూడా లభించడానికి యిన్ని విధాలైన అడ్డంకులు తీరని ఆ వేదనతో, వృద్ధి పొందుతూఉన్న విద్యా పిపాస నిరాధారంగా పోవలసిందేకదా! విద్యకు ధనానికి సంబంధం లేదని వాదిస్తారు, విద్య ముందర ధనం లెక్కలేదంటారు. విద్యకు కూడా ఈ రోజులలో ధనం అవసరమైనదని చెప్పక తప్పదు. ధనము లేనివాడు చదవడానికి కూడా అర్హుడు కాడు. తుదకు జీవించడానికి కూడా తగడేమో? ప్రారబ్ధంకర్మ ఇవే కారణాలేమో ఈ ఉచ్చనీచ దశలకు? సంపన్నత్వానికి, బీదతనానికి? చివరి శరణ్యం వేదాంతం-అదృష్టం-వైరాగ్యం-తృప్తి-ఇవే అభేద్య కవచాలు. ఇవే ఆలోచనలు—ఎల్లాగైతేనేం, కళాశాల విద్యకు ఇంతటితో స్వస్తి చెప్పక తప్పిందికాదు

తరువాత కార్యక్రమం-ఒక గుమాస్తా ఉద్యోగం—ఎందూ గతిలేనివాడు చేసేదేం! జీవన్మృతావస్థలో ఉన్న మా బోంట్లు, ధనప్రభావ పూరితమైన ఈ ప్రపంచంలో, ఆత్మగౌరవం, మానసిక స్వాతంత్ర్యం, విద్యాకృషి, అనే విషయాలకు యెప్పుడో తిలాంజలి యిచ్చి, మోడు బారిన గుండెతో, కుర్చీ బల్లలమధ్యన పడి, రాత్రింబవళ్లు, కవిలెకట్టలలో మునిగి తేలుతూ ఉండక చేసేదేం? ప్రొద్దునే నిద్దుర లేస్తూనే కావలసింది డబ్బు. సరిగా నెలగడచే సరికి ఒకటో తారీఖున వస్తాయని ఆశించిన నాల్గుడబ్బులు రావడంలో రెండురోజులు ఆలస్యమైతే సరి అప్పుల వాళ్ల పటాలం యింటిమీద ఫిరంగులు కురిపిస్తారు. పైకి పటారం లోపలలొటారం. పది ఉన్నా లేకున్నా పైకిమాత్రం ముఖంలో గాంభీర్యం పెట్టుకొని తిరుగకపోతే తప్పదు లోంపలో జరిగే ఆర్థిక సంబంధమైన యిబ్బందులను దిగమ్రింగాలి బంధు మిత్రాదుల వివాదలను, ఇతర నైరాశ్యాలను జీర్ణించుకోవాలి. కచ్చేరీలో అధికారులు అప్పుడప్పుడు వడ్డించే మంగళ

(47-వ పేజీ చూడండి)



# అదృష్టకవచం

(6-వ పేజీ తరువాయి)

వారతులు అతి వినయ గాంభీర్యాలతో స్వీకరిస్తూ భరించాలి. స్వయంగా కలిగే అనారోగ్యం, బాధ, మంచీ, చెడ్డా, నిర్లక్ష్యంగా సహిస్తూ ఉండాలి. గుమాస్తా హృదయం ఒక అగ్నిపర్వతాల నిలయం. అన్నీ ప్రేలటానికి సిద్ధంగా ఉంటూ ఉన్నట్టే ఉంటాయి. ఈ అన్నిటిని అణిచి వాటివాటి హద్దులలో ఉంచగలిగిన జితేంద్రియత్వం, సర్వ నియంతృత్వం, సమర్థత, అన్నీ తన శరీరంమీద, తనమీద మాత్రమే కలిగి ఉండేవాడు గుమాస్తా మాత్రమే. ఆ జీవితంలో చొచ్చుకున్నంత వరకు యెవరికీ అర్థంకాదు. నాకూ మొదటి సారి చూచినప్పుడు పరవాలేదు. ఈ గౌరవనీయమైన జీవితంలో తేలాడుతూ ఉండే గుమాస్తా సోదరులలో నేనూ ఒకణ్ణై పెటపెటలాడే సాంసారిక కష్టమయ జీవితాన్ని వచ్చే రూకలతో కొంచెం శాంతి పరచవచ్చు అని సంతోషంతో ప్రవేశించా.

ఎక్కడ పోయినా మన ముఖానసే పొద్దుపొడిచిందన్నట్లు ఉద్యోగాభివృద్ధులయేవి వచ్చినా సిఫారసులు, పెద్ద చదువులు, నిమ్న వర్గత్వం, కావలసి వచ్చేది. ఒకప్పుడు సిఫార్సులు లేవని, వేరొకప్పుడు పెద్దచదువు లేదని, పై ఉద్యోగం వచ్చే చోట అడ్డంకి. అట్టే చూస్తూండగానే తోటివాళ్లంతా చకాచకా పైకి యెక్కిపోవడం, మనం ఉన్నచోటనే ఉండడం. ఎవరితోనైనా చెప్పితే సానుభూతి వాక్యాలతో 'నిజంగా అన్యాయమే జరిగింది. ఇట్లా జరగటం తగదు'ని విచారించేవారు. అంతా అందోళన పడేవారే. కాని ఫలితం అంతే. కర్మ, ప్రాప్తం, అదృష్టం!

ఇటువంటి దుర్భరకష్టమయ జీవితంలో, ఉపకార వేతనం (పెన్షను) తీసికొనే వరకూ గుమాస్తాగానే ఉన్న నాస్థితి ఒకసారి కండ్లముందర తాండవించింది. నా కుమారుడు కూడా ఇటువంటి జీవిత నౌకలోనే పయనించాలా? ఛీ. కాదు, కాదు. పెద్ద చదువు కావాలి. పెద్దచదువు. ఏదీ? బి. ఏ., ఎం ఏ.,! ఇది చదివీ మళ్లీ గుమాస్తా కాకుంటే ఆపై గుమాస్తా! అదీ కాకుంటే అంతకూ పైది: ఇంతకంటే సాధించగలదేం? ప్రతి చదివేవాడు ఒక గొప్ప ఉద్యోగాన్నే దృష్టిలో పెట్టుకొని చదివితే అన్ని గొప్ప ఉద్యోగాలుంటాయా? ఉండవు. (టెక్నికల్) శాస్త్రప్రయోగ విద్యలు-న్యాయ(లా) నిర్మాణ (యింజనీరింగు) విద్యలు గొప్ప ధనసంపన్నులకు సాధ్యమైయుండగా, నావంటి సామాన్యుల కెలా అందుబాటులో ఉంటాయి? ఈ అనుకునే పై చదువు ధనం ప్రధానంగా తీసికొన్నా ఎక్కువ డబ్బు వచ్చే ఉద్యోగాలు దొరకవాయె. కాని జ్ఞానం, బుద్ధి పారమార్థిక చింతన, సదాచారాలు నేర్చుకొనేదేమైనా ఉన్నదా అంటే అదీ మృగ్యం. పెద్దచదువు, చిన్న బుద్ధి, చిన్న ఉద్యోగాలు, ఛీఛీ! ఇది నిజానికి పెద్ద 'చదువు కాదు. పెద్ద జీవితం దీనితో రాదు. పరిసరాలను బంధించే ఆర్థిక తత్వాన్ని త్యాగమయ లక్ష్యాలతో ఛేదించి, నిరామయ, నిర్వ్యిచార తాత్త్విక శుద్ధ విలక్షణమైన పూర్వఋషి జీవితం శ్రేష్ఠం. మలిన యుక్తమైనది వ్యర్థమైన అర్థచింతాపరత్వమైనదైన జీవితం నింద్యం. కాబట్టి దివ్య విజ్ఞానాన్ని బోధించే చదువే పెద్దచదువు.

అప్పపాటులో—'మాతృదేవోభవ!—పితృదేవోభవ!— ఆచార్య దేవోభవ! అతిథిదేవోభవ! సత్యంవద' ధర్మంచర, బ్రహ్మచర్యేణ తపసా దేవాః మృత్యుముపఘ్నత! కృణ్వంతో విశ్వమార్యం-యాన్యస్మాకగ్ం సుచరితాని తాని త్వయోపాస్యాని నో ఇతరాణి-' అనే వైదిక సూక్తుల పరమ లక్ష్యాలతో ప్రకాశించే, గురుకులాశ్రమ భిత్తికలు కన్నులముందర నిల్చినై. నలువైపులనుండి, 'యధా వృక్షస్య సంపుష్పితస్య దూరాద్గంధో వాతి' అని సస్వరమైన మంత్రాధ్యయనం చెవులకు విందుగా వినవచ్చింది.

ఇటువంటి పవిత్ర వాతావరణం సృష్టించి సచ్ఛాత్రులుగా నేటి యువకులను సిద్ధముచేసి సర్వశాస్త్ర కోవిదులుగా ఎందుకు చేయరాదు? కులవర్గ భూతాదుల కుతంత్రాలు ప్రవేశించకుండా, లోభప్రధానమైన ధనం అడుగు పెట్టకుండా ఉండే విద్యానిలయంలో ఎందుకు పిల్లలను చదివించరాదు. పరాధీనమైన చదువు, సదాచారలేశములేని విద్య, ధనములేనివాడు అర్జించరాని విద్య, ఎందుకు? ఎందుకని అంతా కోరుతున్నారు? ఇదొక జటిల సమస్య అయిపోయింది. పోనీ... అందరి సంగతి మనకేం?-మనంమాత్రం-కాదు, నేనుమాత్రం తప్పక ఈ ప్రస్తుత మలిన వాతావరణాన్ని బహిష్కరించాలి. అబ్బాయిని గురుకులాశ్రమ విద్యలో ప్రవేశింపజేయాలి.


ప్రపంచధోరణిలోకివచ్చి చూచా. కుర్రవాడు యెప్పుడో అవతలికి వెళ్లిపోయాడు.

అప్పుడే హరిద్వార గురుకులాశ్రమం వారికి ప్రవేశనియమావళికోసం లేఖ వ్రాశా. జవాబు వారంరోజులకు వచ్చింది. 'పదేండ్లలోగా ఉన్న కుర్రవాణ్నైతేనే చేర్చుకుంటామని' ఉన్నది. ప్రత్యేక పరిస్థితులలో మా కుర్రవాణ్ణి చేర్చుకొమ్మని, 'వాడు 15 సంవత్సరాలు మాత్రమే ఉన్నాడ'ని వ్రాశా?-'సుతరామూ వీలుకాదని, గురుకులాశ్రమ నియమాల్నిబట్టి తొమ్మిది సంవత్సరాలలోగా పిల్లలనే చేర్చుకోవలసిన మాట, కాని ఈ కాలపరిస్థితులబట్టి పది సంవత్సరాలవరకు వయస్సును పొడిగించామని, అదేసంస్థ చేసిన గొప్ప ఔదార్యం, అంతకు మించి అనుమతించ వీలులేదనియు, ఇట్లు వ్రాసినందుకు క్షంతవ్యులమ'ని ఎంతో ఆప్యాయంగా జవాబు వ్రాశారు. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలలో నెలరోజులు గడచినై

మొదటిభావాలు నెమరువేసుకొని వాటిని విరుద్ధ దృష్టితో విమర్శించుకొని, 'అన్యథాశరణం నాస్తి' అని కళాశాలకోసం అబ్బాయిని పరుగెత్తించా. పోయేవరకు ప్రవేశకాలం గడిచింది. సీట్లులేవని తిరుగగొట్టారు. 'ఘృతాధారం పాత్రంవా?' అనే ఆలోచనలతో ఆ సంవత్సరం చదువు పోయింది. దానికి అదృష్టమే శరణ్యంగా తోచింది తృప్తి పడడానికి.

ఎటుపోయినా అదృష్టమే-మనదేశంలో చిరకాలంనుండి కాపాడుతున్నదీ ఒకే ఒకటి-అదే, 'అదృష్టకవచం-' ★


రోల్డుగోల్డు చేతిగడియారం రు. 17/8



స్విస్‌మేడ్ సరైన టైము చూపించే గడియారాలు, 10 సం లు గ్యారంటీ. గుండ్రటి లేక చదరపు రోల్డుగోల్డు కేసు, 4 జ్యూయల్సు రు 17-8-0 సుపీరియర్, సెంటర్ సెకండ్ రు. 18-8-0 త్రీల సైజు 6 జ్యూయల్సు రోల్డుగోల్డు రు 24 రెక్టాంగ్యులర్, క్రోం కేసు 6 జ్యూయల్సు రు 28-8-0. 15 జ్యూయల్సు ఫ్లాట్ షేపు రు 36. రెక్టాంగులర్ షేపు. రోలుగోల్డు కేసు 7 జ్యూయల్సు రు 30 ఉత్తమమైనది రు 40 డిటో 15 జ్యూయల్సు రు 50 జేబు గడియారం రు 14 యు యస్ ఎ ఫ్లెక్సిబెల్ బెల్ట రు 2. ఉత్తమమైనది రు 2-8-0 పోస్టేజి అ, 14

KOHINOOR WATCH CO, (A)

Post Box No 12217, CALCUTTA-5.



గానకళాబోధిని

గొప్ప సంగీత గ్రంథము. చిన్నలు పెద్దలకు గవర్నమెంటు పరీక్షలకు ఉపయోగపడును. సుమారు 800 పేజీలు గల పుస్తకము వెల 10-0-0 పోస్టేజి వేరు

బాలసరస్వతి బుక్‌డిపో కర్నూలు